THE WORD OF TRUTH

# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

## రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల సువార్త ప్రసారములు

తెలుగు — SATYA VANI

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం గం 2-30 కు

హిందీ — SATYA SUSAMACHAR

మంగళవారము, గురువారము, శుక్రవారము — 9.00 to 9-15 p. m.
ఆదివారము — 1-30 to 1-45 p. m.

ఇంగ్లీషు — The Voice of Truth

ఆదివారము —9-30 to 9-45 p. m.
మంగళవారము — 9-30 to 9-45 p. m.

తమిళం — SATYA VAZHI

మంగళవారము — 5-30 to 5-45 p. m.
గురువారము — 6-45 to 7-00 p. m.
శుక్రవారము — 6-45 to 7-00 p. m.

మళయాళం — The Voice of Truth

మంగళవారము — 3-45 to 4-00 p. m.
శుక్రవారము — 3-45 to 4-00 p. m.

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికీ విన్పించండి.

తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సు కొరకు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి.

**SATYA VANI**
**P. O. Box 80, KAKINADA-533 001**

Razan Press, Kakinada.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box. 80, KAKINADA-533 001.**

*Editor* — J. C. CHOATE

*Managing Editor* — JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity.

సంచిక **6** — జనవరి **1982** — సంపుటి **2**


## సంపాదకీయము

### పరలోక నివాసులు నేడు మానవులను దర్శించుచున్నారా?

### *(Do Heavenly Beings Visit Men Today?)*

ఇటీవల మేము జరిగించిన సువార్తకూటమునకు ఒకాయన ప్రతిరాత్రి హాజరయ్యేవాడు. ఆకూటములో అపొస్తలుల కార్యములలో మార్పు జెందినవారి సందర్భములనుగూర్చి బోధించుచు, ఆ కాలమందు ప్రభువు దూత ఎవనికైనను కనబడినయెడల అతనికిగాని మరెవనికిగాని ఆదూత రక్షణమార్గమును బయలు పరచలేదు; అపని ఎల్లప్పుడు ఒక సువార్తకుడు చేయుచు యుండేవాడు. అందువలన ఈనాడు ప్రభువుగాని, ఆయన దూతగాని ఎవనికైనను దర్శనమిస్తే రక్షణ పొందుటకు అతడేమి చేయవలెనో వారతనికి తెలియ జెప్పరు; ఏలయనగా తన సువార్త సర్వసృష్టికి ప్రకటింపబడ వలెనని క్రీస్తు తన శిష్యుల నాజ్ఞాపించెను అని నేను చూపించితిని. అది నిజమే అయితే పరలోక నివాసులు ఎవరు మానవునికి ఈనాడు దర్శన మీయవలసిన

పనిలేదని నేను చూపించితిని. ఈసువార్త కూటములకు హాజరగుచున్న యతడు నేను చెప్పుదానితో ఏకీభవించు చున్నట్లు తల ఊపేవాడు. నా ప్రసంగము ఎంతో బాగున్నదని నన్ను అభినందించేవాడు. చివరిగా, ఆఖరిరాత్రి అతడు వెళ్లిపోవుచు క్రీస్తు అతనికి దర్శనమిచ్చినట్లు నాకు తెలియజేసాడు. ఎందునిమిత్తము ప్రభువు నీకు దర్శన మిచ్చాడని నేనడుగగా అది నేనెరుగనని అతడు జవాబిచ్చాడు. ఈకూటములలో మనము పఠించిన దేమిటి? అని నేనతని అడిగితిని. మీారు నమ్మరని నాకు తెలుసు గాని క్రీస్తు నాకు దర్శన మిచ్చాడని అతడు జవాబిచ్చాడు.

ప్రపంచ మంతటా, వివిధ మతస్థులు క్రీస్తుగాని లేక ఏదో పరలోక నివాసిగాని వారికి కనబడ్డారని ఊహించుకొనుచు యుండుట చాల విచారకరమైనది. అట్టిది జరుగునా? అట్టిది జరుగదు. ఈ ప్రజలు అబద్ధమాడుచున్నారని వారు నిష్కపటులుకాదనిగాని నా ఉద్దేశ్యము కాదు. అయితే ఒకని మనస్సు ఒక్కొకసారి అతని మోసపరచవచ్చును. ఒకడు ఈ సంగతులనుగూర్చి ఆలోచించుకొనుచు యుండి చివరకది నిజముగా జరిగినదని ఊహించుకొన వచ్చును. క్రీస్తు తనకు కనబడుచున్నాడని, తనతో మాట్లాడు చున్నాడని ఒకడు బలముగా ఊహించుకొనుచుండ వచ్చును. తరువాత క్రీస్తు నిజముగా అతనికి కనబడెనని తనతో మాట్లాడెనని ఆలోచించు కొనుచుండవచ్చును. లేఖనములు ఈసంగతిని ఎక్కడా బోధించుట లేదు గనుక ఇది విచారకరము.

అపొస్తలుల కార్యముల గ్రంథములోనికి వెళ్ళి ఆకాలమందు పరలోక నివాసులు ఆయా మనుష్యులకు కనబడినప్పు డేమి జరిగినదో తెలిసికొందము. మొదటిగా ఆకాలము అద్భుతములు జరిగే కాలమని నీవు గమనించవలెను. లిఖించబడిన దేవుని వాక్యము మనకున్నరీతిగా ఆనాడు వారికి లేదు గనుక అపొస్తలులును, వారిచే చేతులుంచబడిన వారును, వాక్యమును స్థిరపరచుటకు అద్భుతములను చేసిరి (మార్క

16:20). అట్లే సువార్త అవసరమైనవారిని, సువార్త బోధించువారిని సమావేశ పరచుటకు పరలోక నివాసులు అప్పుడప్పుడు అగుపడిరి. పేతురును ఒక దేవదూత చెరసాల నుండి విడిపించిన ఉదాహరణ కూడ ఒకటి యున్నది. అయితే జరిగిన దేమిటో ఖచ్చితముగా తెలిసికొనుటకు లేఖనములనే పరిశోధింతము:

1. ఐతియోపీయు డొకడు ఆరాధించుటకు యెరూషలేము వచ్చి తిరిగి వెళ్లుచుండగా అతనిని అరణ్య మార్గమున కలిసికొమ్మని చెప్పుటకు ప్రభువు దూత ఫిలిప్పునకు కనబడెను (అపొ.కా. 8:26-39). తత్ఫలితముగా ఫిలిప్పు అతనిని మార్చగలిగెను. అతడు తన దేశమునకు తిరిగి వెళ్ళినప్పుడు క్రీస్తు రాజ్యవ్యాప్తికి తన ప్రాంతములో తప్పక కృషి చేసియుండెను. అయితే సమరయలో విజయవంతముగా జరుగుచున్న కూటమునుండి అరణ్యమార్గమున ప్రయాణించుచున్న ఈ ఏకాకికి బోధించుటకు దూత ఫిలిప్పును ఎందుకు కొనిపోయెను? ఫిలిప్పును అతడు సమరయలో ఎందుకు విడువలేదు? ఆదూత తనకు తానే సువార్తను బోధించలేదు. అపొ. పౌలు 2 కొరింథీ 4:7 లో ఇట్లు చెప్పుచున్నాడు: "అయినను ఆబలాధిక్యము మామూలమైనదికాక దేవునిదై యుండునట్లు మంటి ఘటములలో ఈ ఐశ్వర్యము మాకు కలదు". ఇక్కడ చెప్పబడిన ఈమంటి ఘటములు మానవులు. సువార్త అను ఐశ్వర్యము వారిలో ఉంచబడినది. ఇంకొక మాటలో మానవునికి సువార్త బోధించే భాధ్యత క్రీస్తు మానవునికే అనుగ్రహించెను. మానవుడు రక్షింపబడునట్లు ఆయన సిలువపై మరణించెను. మానవుడు దానిని చేయజాలడు. గాని అతడు సువార్తను తీసుకొని వెళ్ళగలడు. దానిని తీసుకొని వెళ్ళవలెనంటే అతడే తీసికొని వెళ్ళవలెను. క్రీస్తుగాని ఒక దూతగాని దానిని ఏదో ఒకసారి చేసినయెడల, మానవజాతియంతటికి సువార్తను వారే తీసుకొని వెళ్ళవలెనని మానవుడు తలంచును. వారు ఒక్కసారికూడ దానిని చేసియుండనందునను, సర్వ

సృష్టికి సువార్త ప్రకటించవలెనని క్రీస్తు తన ప్రజల నాజ్ఞాపించి నందు నను (మార్కు 16:15, 16), క్రీస్తుగాని, ఒక దూతగాని మాకు దర్శన మిచ్చి రక్షింపడుటకు ఫలాని కార్యము చేయుమని తెలియజేసినట్లు ఈనాడెవరయినను చెప్పుచున్నయెడల వారు అబద్ధికులని మనము ఎరుగు దుము. మరల అట్టి కట్టుకథలను చెప్పువారు ప్రభువు వాక్యమును అను సరించి లేని సంగతులను చేయుమని ప్రభువు వారికి చెప్పినట్లు ప్రక టింతురు గనుక వారికథలు అసత్యములని మనమెరుగుదుము. క్రీస్తు తన వాక్యములో ఒకటిచెప్పి, ఆయన దర్శనమిచ్చి గాని లేక దూతను పంపిగాని వేరొకటి చేయమని చెప్పడు.

2. అపొస్తలుల కార్యములు 9 వ అధ్యాయములో సౌలు మార్పుజెందిన సందర్భమును మనము చూడగలము. సంఘమును గొప్పగా హింసించిన మనుష్యుడొకడు ఇక్కడ ఉన్నాడు. అతడు దమస్కు వెళ్ళి అక్కడి క్రైస్తవ పురుషులను స్త్రీలను కనుగొని వారిని బంధించి యెరూషలేముకు తీసుకొని వచ్చుటకు, హింసించుటకు అతడు ప్రధాన యాజకునియొద్దనుండి పత్రికలను పొందెను. అయితే అతడు దమస్కు పోవు మార్గమందు క్రీస్తు అతనికి అగుపడెను. అతడు నిజముగా ప్రభువును ఎదిరించుచున్నట్లు అతడప్పుడు గమనించెను. గనుక నేనేమి చేయవలెను అని అతడడిగెను. నీవు లేచి పట్టణములోనికి వెళ్ళుము. అక్కడ నీవు ఏమి చేయవలెనో అది నీకు తెలుపబడునని ప్రభువు అతనికి చెప్పెను. ఈలోగా క్రీస్తు అననీయ అను ఒక బోధ కునికి దర్శన మిచ్చి సౌలు యొక్క విధేయతలో తోడ్పడునట్లు అతడు సౌలు నొద్దకు వెళ్ళవలెనని చెప్పెను ... అతని గూర్చి మంచిసంగతు లేమీ విననందున ముందు అననీయ వెళ్ళుటకు సందేహించెను గాని తొందర ఏమియు ఉండదని ప్రభువు అతనికి హామీ యిచ్చెను. అన నీయ వెళ్ళి సౌలు దృష్టి కోల్పోయి ఉండుటయు, ఉపవాస ముండి ప్రార్థన చేయుటయు కనుగొనెను. అననీయ అతనితో "సౌలా, సహో

దసుడా, నీవు వచ్చిన మార్గములో నీకు కనబడిన ప్రభువైన యేసు నీవు దృష్టిపొంది పరిశుద్ధాత్మతో నింపబడునట్లు నన్ను పంపియున్నా డని చెప్పెను. అప్పుడే అతని కన్నుల నుండి పొరలవంటివి రాలగా దృష్టి కలిగి, లేచి బాప్తిస్మము పొందెను" (అపొ. కా. 9:17, 18). అపొ. కా. 22:16 లో సౌలు అనబడిన పౌలు తాను మార్పు జెందిన సందర్భమును గూర్చి చెబుతూ అననీయ అతని యొద్దకు వచ్చి "నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుమని చెప్పెనని" తెలియజేసెను. అయితే క్రీస్తు సౌలుకు దమస్కు మార్గములో కనబడి నప్పుడు రక్షింపబడుటకు అతడు ఏమి చేయవలెనో అతనికి ఎందుకు తెలియ జేయలేదు? ఏలయనగా అది ఆయన పనికాదు. ఇప్పుడు కూడ మనుష్యులకు కనబడి రక్షింపబడుటకు వారేమి చేయవలెనో వారికి తెలియజెప్పుట ఆయన పనికాదు. ఆయన నీకు కనబడి తన చిత్త మును నీకు బయలు పరచవలెనని నీవు కనిపెట్టుచున్న యెడల నీవు కని పెట్టుట నిష్ప్రయోజనమే.

3. అపొ.కా. 10వ అధ్యాయములో కొర్నేలీ కథన మున్నది. దేవుని దూత ఒకడు అతనికి దర్శన మిచ్చి, తానును తన యింటివారును రక్షింపబడు మాటలను తెలియజెప్పు పేతురును పిలువ నంపుమని చెప్పెను. కొర్నేలీ యింటికి వెళ్ళుమని ఆత్మ పేతురుకు తెలియ జెప్పెను. పేతురును, అతనితో కూడ యున్నవారును కొర్నేలీయు అతని యింటివారును నివసించుచున్న కైసరయకు వెళ్ళిరి. పేతురు వారికి బోధించెను. వారు ప్రభువుకు లోబడిరి. అన్యజనులలో నుండి మార్పు జెందినవారిలో మొదటి వారైరి. మరల కొర్నేలీ, అతని యింటివారు రక్షింపబడుటకు ఏమిచేయవలెనో దేవుని దూత వారికి ఎందుకు చెప్ప లేదు? ఏలయనగా అది దేవుని సంకల్పము కాదు. మిగిలిన సందర్భ ములలో వలెనే సువార్త ఆవశ్యకత కలిగినవారిని సువార్త అందించ

గలవారితో పరలోక నివాసులు సమావేశపరచిరి. అప్పుడు మాత్రమే సువార్త బోధించ బడగలదు, అప్పుడు మాత్రమే కొర్నేలీ, అతని యింటివారు సువార్త విని లోబడ గలుగుదురు.

4. చివరిగా అపొ. కా. 12వ అధ్యాయములో చెరసాలలో యున్న పేతురుకు దేవదూత కనబడి అతని విడుదల చేయించిన సందర్భము గలదు. హేరోదు యాకోబును చంపించెను. ఇది యూదులకు ఇష్టమైన కార్యమని తెలిసికొని పేతురునుకూడ చంపుటకు పట్టుకొనెను. చెరసాలలో అతని బంధించెను. "ఇదిగో ప్రభువు దూత అతని దగ్గర నిలిచెను; అతడుండిన గదిలో వెలుగు ప్రకాశించెను. దూత పేతురు ప్రక్కను తట్టి - త్వరగా లెమ్మనిచెప్పి అతని లేపగా సంకెళ్లు అతని చేతులనుండి ఊడిపడెను. అప్పుడు దూత అతనితో - నీవు నడుము కట్టుకొని చెప్పులు తొడుగుకొనుమనెను. అతడాలాగు చేసిన తరువాత దూత, నీవస్త్రము పైన వేసికొని నావెంబడి రమ్మని అతనితో చెప్పెను. అతడు వెలుపలికివచ్చి దూతవెంబడి వెళ్ళి దూతవలన జరిగినది నిజముగా జరిగెనని గ్రహింపక తనకు దర్శనము కలిగెనని తలంచెను. మొదటి కావలిని రెండవ కావలిని దాటి పట్టణమునకుపోవు ఇనుపగవిని యొద్దకు వచ్చినప్పుడు దానంతటఅదే వారికి తెరచుకొనెను. వారు బయలుదేరి యొక వీధి దాటిన వెంటనే దూత అతనిని విడిచిపోయెను. పేతురుకు తెలివివచ్చి, ప్రభువు తన దూతను పంపి హేరోదు చేతిలో నుండియు, యూదులను ప్రజలు నాకు చేయ నుద్దేశించిన వాటన్నిటినుండియు నన్ను తప్పించి యున్నాడని ఇప్పుడు నాకు నిజముగా తెలియునని అనుకొనెను" (అపొ. కా. 11 : 7-11). అయితే దూత ఎందుకు ఈపనిని చేసెను? ఈసందర్భములో పేతురు చేయవలసిన ప్రభువు పని ఎక్కువ ఉన్నది గనుక ప్రభువు అతనిని విడుదల చేయించెను (మార్కు 16:17, 18). తరువాత చరిత్ర ప్రకారము పేతురు క్రీస్తు సువార్తకొరకు హతసాక్షిగా మరణించెను గాని

అప్పటికి లోకమందంతట సువార్త ప్రకటించబడెను, అతని పని సంపూర్తి ఆయెను, గాని మోసపోవద్దు. ప్రభువు మనయొద్దకు వచ్చుటలేదు లేదా ఒక దూతనుగాని మనకొరకు పంపించడు. అందునిమిత్తమై ఆయన వాగ్దానము చేయలేదు. అట్లు ఆయన చేయడు, ఆయన తన సహాయ కర్తమైన కృపచొప్పున అనగా ప్రకృతి చట్టముద్వారా, మానవుల చట్టముద్వారా, సహజ సంఘటనలద్వారా మనకు సహాయము చేయవచ్చునుగాని కొన్ని అద్భుత సంఘటనలద్వారా ఆయన సహాయము చేయడు. ఆయన ఎందుకు చేయడు? ఆయన చేయలేడా? ఆయన సమస్తమును చేయగలడు గాని ప్రస్తుతము అనాద్భుతరీతిగా పనిచేయుటకు, మన సమస్యలలో సహాయము చేయుటకు ఆయన నిశ్చయించు కొనియున్నాడు.

సంక్షిప్తముగా ప్రభువుగాని, ఒక దూతగాని ఆయన వర్తమానము నందించుటకు నీకుగాని, నాకుగాని, మరెవరికిగాని అగుపడరని మరొకసారి తెలియజేయ గోర్తాను. ఆయన తన వాక్యమును మనకు ఇచ్చియున్నాడు, అది స్థిరపరచబడియున్నది. దానిని సర్వలోకమునకు తీసికొని వెళ్ళవలెనని ఆయన తన ప్రజలను కోరియున్నాడు (మార్కు 16:15,16). మనము ఆయన వాక్యమును పఠించవలెను(2తిమో 2:15). ఆయన వాక్యమును పరిశోధించవలెను (యోహాను 5:39). వినుట వలన విశ్వాసము కలుగునని (రోమా 10:17) మనము వాక్య ప్రకారము చేయువారై యుండవలెనని చెప్పబడియున్నది (యాకోబు 1 : 22). అది యథార్థమైతే మనకు దర్శనమిచ్చుటకు మనతో మాట్లాడుటకు క్రీస్తుకుగాని ఒక దూతకుగాని ఆవశ్యకత యేమున్నది? దాని ప్రయోజనమేమున్నది? దేవుని సంపూర్ణ చిత్తము మనకు ఇయ్యబడి యుండగా మనకు అందించే వర్తమానము ఏమున్నది?

పౌలు గలతీయులకు ఇట్లు చెప్పెను : "...క్రీస్తు సువార్తను చెరుపగోరి మిమ్మును కలవరపరచువారు కొందరున్నారు. మేము మీకు

ప్రకటించిన సువార్త గాక మరియొక సువార్తను మేమైనను పరలోకము నుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవునుగాక. మేమిదివరకు చెప్పిన ప్రకారము ఇప్పుడును మరల చెప్పుచున్నాము; మీరు అంగీకరించిన సువార్త గాక మరి యొకటి యెవడైనను మీకు ప్రకటించిన యెడల వాడు శాపగ్రస్తుడవునుగాక" (గలతీ 1:7-9). అయితే పౌలు యిక్కడ ఏమి చెప్పుచున్నాడు? అతడు పవిత్రమైన ఒకే సువార్తను వారికి బోధించినట్లు అతడు వారికి జ్ఞాపకము చేయుచుండెను. అట్లయినను సరే అతడు బోధించినది గాక వేరొక సువార్తను ఎవడైన వారికి బోధించిన యెడల అతడు శాపగ్రస్తుడవును. అతడు బోధించి యుండినదే తప్ప దానికి భిన్నమైన సువార్తను అతడుగాని పరలోకము నుండి వచ్చిన యొక దూతగాని ప్రకటించిన యెడల వారు శాపగ్రస్తులవుదురని అతడు చెప్పెను. నా మిత్రులారా, అది పౌలు యెడలను, పరలోకము నుండి వచ్చిన దూత యెడలను సత్యమైతే అది ఈనాడు మన యెడల ఎందుకు సత్యము కాదు? అంటే క్రీస్తు యొక్క ఒకే పవిత్ర సువార్త మనకు లేఖనములలో బయలుపరచబడి యున్నది యని దీని యర్థము. అయితే ఎవడైనను వచ్చి దానికి భిన్నమైన దానిని ఏమైనను బోధించిన యెడల లేదా కొందరు అపోహ పడుచున్నట్లు పరలోక దూత యొకడు వచ్చి దానికి భిన్నముగా బోధించిన యెడల ప్రభువు శాపము అతని మీద నిలుచును.

మిత్రులారా, దేవుని సత్యము మనకు బైబిలునందు ఈయబడి యున్నది. మరియు ప్రభువు మనలను ఏమి చేయుమని కోరుచున్నాడో మనము తెలిసికొన గోరిన యెడల మనము దాని యొద్దకే వెళ్ళవలెను. లేఖనములలో బోధింపబడిన దానికి మనము లోబడినప్పుడు మాత్రమే దేవుని చిత్తమును నెరవేర్చిన వారమగుదుము. అప్పుడు మాత్రమే సత్యము మనలను రక్షించును, పరలోకమునకు చేర్చును. అది యథార్థము. అట్లగుచో మనకు కావలసింది ఇంకేముంది? ★

# దేవుడు కనుపించునా?

## *(Does God Appear?)*

నేటి క్రైస్తవ లోకంలో దేవుడు కనుపించునా కనుపించడా అను సమస్య పెద్ద కలవరపాటు కలిగించుచున్నది. కొందరికి దేవుడు కనిపించి, మాట్లాడి, వాగ్దానాలు యిచ్చినట్లు చెప్పెదరు. ఈనాడు అనేకులు దేవుడు కనుపించి, మాట్లాడెనని చెప్పుచు ప్రజలను దేవుని చిత్తమునుండి పెడత్రోవ పట్టించుచున్నారు. ఒక బోధకుని బాప్తిస్మము ఎలా యివ్వాలని ప్రశ్నించగా ఎవరికి యిష్టమైన విధానంలో వారికి యిమ్మని దేవుడు కనుపించి చెప్పెనని సమాధానమిచ్చెనట! దీనినిగూర్చి బైబిలు ఏమి చెప్పుచున్నది?

అనేకులు క్రీస్తు సిలువలో రక్తం కార్చుచున్నట్లు, లేక తెల్లని అంగీని ధరించుకొని వారికి దర్శన మిచ్చినట్లు చెప్పెదరు. ఈలోకంలో మనం చూచు అనేక దృశ్యములను కలలో చూతుము. ఇతర దృశ్యములు కలగంటె అదికల అని, దేవునిరూపము అని చెప్పబడె చిత్రం కలగంటే అది దర్శనమని చిత్రించువారు అనేకులు. అయితే బైబిలు చెప్పు కొన్ని వచనములు గమనింతము. "ఏ మానవుడును దేవుని ఎప్పుడును చూచియుండలేదు" (1 యోహాను 4:12). యోహాను 1:18లో కూడ ఎవడును, ఎప్పుడైనను దేవుని చూడలేదని వ్రాయబడియున్నది. ఈరెండు వచనములనుబట్టి కొందరు చూచినారని చెప్పుటకు వీలులేదు. అంతేకాక ఎవరు ఎప్పుడును చూడలేదని ఈవాక్యములు చెప్పుచున్నవి. కాని యిప్పుడు చూచుచున్నాము అని కొందరు అనవచ్చును. దానికికూడ బైబిలు సమాధానం చెప్పుచున్నది. ఆయన సమీపింపరాని తేజస్సులో వున్నాడనియు, మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదని, చూడనేరడని వ్రాయబడెను (1 తిమోతి 6:16). ఈనాడు ఆయనే సమీపించుచున్నాడా?

దేవుడు అక్షయుడు, అదృశ్యుడు (1 తిమోతి 1:17). అదృశ్యుడు అనగా కనిపించనివాడు. "మీరు ఏ కాలమందైనను ఆయన స్వరము వినలేదు, ఆయన స్వరూపము చూడలేదు" (యోహాను 5:37). "దేవునియొద్దనుండి వచ్చినవాడు తప్ప మరి యెవడును తండ్రిని చూచి యుండలేదు; ఈయనే తండ్రిని చూచియున్నాడు" (యోహాను 6:46).

అపొస్తలుడైన పౌలు సౌలుగా యున్నపుడు క్రీస్తు దర్శనము కలుగలేదా? అని కొందరు ప్రశ్నింతురు. సౌలుకు క్రీస్తు ఎలా దర్శన మిచ్చెను? ఈనాడు అనేకులచే చెప్పబడుచున్నట్లుగా కాదుగాని వెలుగుగా దర్శన మిచ్చెను. అపొ. కార్యములు 9:1-9 వరకు చదవండి. దీని తరువాత క్రీస్తు ఎవరికైనా మానవ శరీరంతో కనిపించినట్లుగా క్రొత్త నిబంధనలో చదువగలమా?

అయితే పాతనిబంధన కాలంలో అనేకులకు దేవుడు కనిపించెనని కొందరు అభిప్రాయ పడుదురు. మోషేతో దేవుడు "నీవు నాముఖమును చూడజాలవు; ఏనరుడును నన్ను చూచి బ్రతుకడనెను" (నిర్గమ 33:20). ఈ వచనంలో "నా ముఖమును" అని, 22వ వచనములో "నా చేతితో" అని దేవుడు మాట్లాడుచున్నాడు. దేవుడు ఆత్మ స్వరూపి అయితే ముఖము, చేయి అని చెప్పుచున్నాడే అనే అనుమానం కలుగవచ్చు. అచట అలంకార రూపంలో చెప్పబడినది. ఆత్మ ఒక పురుషునిగా పోల్చి మాట్లాడబడెను. పౌలు ఆత్మను ఆంతర్య పురుషుడని సంబోధించెను (2 కొరింథి 4:16).

లేవీకాండము 9:4 చివరిభాగంలో మోషే అహరోనులు ఇశ్రాయేలీయులతో యెహోవా మీకు కనబడునని చెప్పిరి. అయితే ఎలా కనిపించాడు? 9 : 23, 24 వచనములు చదవండి. అరణ్యములో మోషేకు దేవుడు ఎలా కనిపించాడు? మండుచున్న పొదలో, అగ్నిగానేకదా? సీనాయి పర్వతందగ్గర ఇశ్రాయేలీయులకు ఎలా కనిపించాడు? పెద్ద కాంతితోగదా? (ద్వితీ. కాం. 5:4). మరి ఈనాడు?

దేవుడు అనేకులకు కనిపించి మాట్లాడుతుంటే ఆనాడు శిష్యులు

చనిపోయిన యూదా స్థానమును భర్తీచేయుటకు ఎందుకు చీట్లు వేయవలసి వచ్చెను? (అపొ. కార్య 1 : 23-26). దేవుడు వారికి కనిపించి మాట్లాడవచ్చు కదా?

"హృదయ శుద్ధిగలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు" (మత్తయి 5:8). జరగబోయే దానిని గూర్చి మాట్లాడుచుండుటచేత 'చూచెదరు' అని ఇక్కడ చెప్పబడెను. అయితే ఇది ఎప్పుడు జరుగుతుంది? మత్తయి 5:1-12 వరకు, లూకా 6:20-23 వరకు జాగ్రత్తగా చదివిన యెడల దేవుని చూచుట అనునది పరలోకములో జరగబోవు సంగతి అని అర్ధమగుచున్నది. దేవుడు నాకు కనిపించాడు. నాతో మాట్లాడినాడు అని చెప్పు అనేకులు "దేవా! నాకు కనబడుము. నాతో మాట్లాడుము" అని ప్రార్థింతురు. కనిపించి మాట్లాడిన తరువాత అదే ప్రార్థన మరలా చేయటం అర్ధములేనిది కదా! అంటే పదేపదే కనిపించి మాట్లాడమని వారి కోరిక కాబోలు.

పైన పొందుపరచిన దేవుని వాక్యములనుబట్టి ఇపుడు నీ ఉద్దేశ్యమేమిటి? దేవుడు కనబడుననునది మతశాఖల సిద్ధాంతము. అది బైబిలు బోధకాదు. అందుచే సత్యమును గ్రహించి మారుమనస్సు పొంది, బాప్తిస్మముద్వారా మతశాఖలను వీడి బైబిలు చెప్పుచున్న నిజసంఘమైన క్రీస్తు సంఘసభ్యుడవు కమ్ము!!

—R. డేవిడ్ లివింగ్‌స్టన్
కామవరపుకోట.

---

# సబ్బాతు సంగతి యేమిటి?-2

## (*What about Sabbath?*)

— ఆల్బర్ట్ గార్డనర్.

### గ్రంథము, పలకలు

బైబిలును సన్నిహితంగా పఠించు విద్యార్థులందరు పదియాజ్ఞలను రాతిపలకపై దేవుడే వ్రాసి యిచ్చెనని అంగీకరించక తప్పదు.

పది యాజ్ఞలు మొదటిసారి రెండవసారికూడ వ్రాయబడినప్పుడు దేవుడే వ్రాసి యిచ్చెను. (నిర్గమ 24:12; 34:1).

అయితే మోషేచే వ్రాయబడిన గ్రంథము సంగతి యేమిటి? మనము నిర్గమ 19వ అధ్యాయమును పరిశీలించినప్పుడు సీనాయి కొండపై జరుగబోవు దానినిగూర్చి ప్రజలు సిద్ధపడుటను చూడగలము. సమస్తము సిద్ధపడినప్పుడు దేవుడు ప్రజలతో పది ఆజ్ఞలలోని మాటలను నిర్గమ 20:1-17లో పలుకుట కారంభించెను. ఆ సమయమందు ప్రజలు ఉరుములను, మెరుపులను, కొండపై పొగను చూచిరి మరియు గొప్ప బూరధ్వనిని వినిరి. వారు మిగుల భయపడి వణికిరి. వారు చావకుండునట్లు దేవుడుకాదుగాని మోషే వారితో మాట్లాడవలెనని వారు కోరిరి. మోషే మాట్లాడుటకు దేవుడు సెలవిచ్చెను మరియు అనేక యితర శాసనములను బయలుపరచెను. అవి నిర్గమ 21నుండి 23 వరకు గల అధ్యాయములలో లిఖించబడెను.

అప్పుడు "మోషే వచ్చి యెహోవామాట లన్నిటిని, విధులన్నిటిని ప్రజలతో వివరించి చెప్పెను. ప్రజలందరు యెహోవా చెప్పిన మాట లన్నిటి ప్రకారము చేసెదమని యేకశబ్దముతో ఉత్తరమిచ్చిరి" (నిర్గమ 24:3). మోషే యెహోవా మాటలన్నిటిని వివరించి చెప్పెను. వీటిలో పది ఆజ్ఞలు మరియు ఇతర శాసనములు ఇమిడి యుండెను. యెహోవా మాటలన్నియు నిర్గమ 21 నుండి 23 వరకు గల అధ్యాయములలో వ్రాయబడెను. యెహోవా చెప్పిన మాటలన్నిటి ప్రకారము చేసెదమని ప్రజలు అంగీకరించిరి.

"మరియు మోషే యెహోవా మాటలన్నిటిని వ్రాసెను" (నిర్గమ 24:4). "అతడు నిబంధన గ్రంథమును తీసుకొని ప్రజలకు వినిపింపగా వారు యెహోవా చెప్పినవన్నియు చేయుచు విధేయులమై యుందు మనిరి" (నిర్గమ 24:7). అప్పుడతడు రక్తము తీసికొని గ్రంథము మీదను, ప్రజలందరి మీదను ప్రోక్షించెను (హెబ్రీ 9:20). ధర్మ

శాస్త్ర ప్రకారము నడుచుకొందుము అని ప్రజలు అంగీకరించిరి. అది రక్తముతో ముద్రవేయబడెను. దేవునికిని ఆయన ప్రజలకును మధ్య గల ఈ ధర్మశాస్త్రము ఇప్పుడు స్థిరపరచబడెను. మోషే యెహోవా మాటలన్నిటిని వ్రాసెను మరియు ఆ గ్రంథమును తీసుకొని ప్రజలకు వినిపింపగా దానికి లోబడుటకు వారు సమ్మతించిరి. యెహోవా మాటలన్నియు అనినప్పుడు దానిలో నిర్గమ 20-23 అధ్యాయములలో గల పది ఆజ్ఞలు, యితర శాసనములు ఇమిడి యున్నవి.

దేవుని పిలుపునకు లోబడుచు, మోషేయు, అహరోనును, నాదాబును, అబీహును, ఇశ్రాయేలీయుల పెద్దలలో డెబ్బది మందియు దేవుని నారాధించుటకు కొండ ఎక్కి వెళ్ళిరి. వారు దేవుని గొప్ప మహిమను తెలిసికొన గల్గిరి. వారు ఆరాధించిన తరువాత మోషేకు దేవునినుండి ఒక పిలుపు వచ్చెను: "అప్పుడు యెహోవా మోషేతో ఇట్లనెను. నీవు కొండయెక్కి నాయొద్దకు వచ్చి అచ్చట నుండుము; నీవు వారికి బోధించునట్లు నేను వ్రాసిన ఆజ్ఞలను, ధర్మ శాస్త్రమును, రాతి పలకలను నీకిచ్చెదననెను" (నిర్గమ 24:12).

దేవునిచే పది ఆజ్ఞలు వ్రాయబడిన రాతి పలకలను గూర్చి ప్రప్రథమముగా ఇక్కడ చెప్పబడెను. అయితే పది ఆజ్ఞలు అంతకుముందే ఇయ్యబడెను. నిర్గమ 20వ అధ్యాయములో వాటిని దేవుడు ప్రజలకు చెప్పెను, వారు భయపడిరి. అవి నోటితో చెప్పబడుటయేగాక, వాటిని, మిగిలిన దేవుని ఆజ్ఞలను మోషే ఒక గ్రంథమందు వ్రాసి ప్రజలకు వినిపింపగా వాటికి బద్ధులమై యుందుమని వారంగీకరించిరి. రాతి పలకలను గూర్చి చెప్పబడక ముందే ఇదంతయు జరిగెను.

మోషే దేవుని కొండమీదికి ఎక్కి వెళ్ళి అక్కడ రేయింబవళ్లు నలువది దినములు లుండెను. ప్రత్యక్ష గుడారము (మందిరము) యొక్క నమూనాను అతడు పొందెను (నిర్గమ 25:9). "మరియు ఆయన సీనాయికొండమీద మోషేతో మాటలాడుట చాలించిన

తరువాత ఆయన తన శాసనములు గల రెండు పలకలను అనగా దేవుని వ్రేలితో వ్రాయబడిన రాతిపలకలను అతని కిచ్చెను" (నిర్గమ 31:18).

మోషే కొండదిగి వచ్చినప్పుడు ప్రజలు బంగారు దూడ నొకదానిని ఆరాధించుట కనుగొనెను. అతడు కోపముతో మండిపడి ఆ పలకలను పడవేసి వాటిని పగులగొట్టెను. మరియు అతడు వారు చేసిన ఆ దూడను తీసికొని అగ్నిలోకాల్చి పొడిచేసి నీళ్ళమీద చల్లి ఇశ్రాయేలీయులచేత దానిని త్రాగించెను. ఆపలకల కొరకు అతడు రెండవసారి కొండమీదికి వెళ్ళవలసి వచ్చెను. మరల అక్కడ అతడు నలువది దినములుండెను.

తరువాత మోషే వ్రాసిన ధర్మశాస్త్ర గ్రంథమునుగూర్చి మనము చదువునప్పుడు, దానిలో పది ఆజ్ఞలు, మిగతా శాసనములు ఇమడ్చబడి యున్నవని గ్రహించుకొన గలము. ద్వితీయోపదేశ కాండము 31:9లో, మోషే ఈధర్మశాస్త్రమును వ్రాసి యాజకులకును, ఇశ్రాయేలీయుల పెద్దలకును దాని నప్పగించి "మీరు ఈ ధర్మశాస్త్ర గ్రంథమును తీసికొని మీ దేవుడైన యెహోవా నిబంధన మందసపు ప్రక్కన ఉంచుడి. అది అక్కడ నీమీద సాక్ష్యార్థముగా ఉండును" అని చెప్పెను (ద్వితీ 31:26). ప్రజలపై ఎక్కువ ప్రభావము కలిగినవాడు రాజై యుండును గనుక, మోషే రాజులకు కొన్ని హెచ్చరికల నిచ్చెను: "మరియు అతడు రాజ్య సింహాసనమందు ఆసీనుడైన తరువాత లేవీయులైన యాజకుల స్వాధీనములోనున్న గ్రంథమును చూచి ఆధర్మశాస్త్రమునకు ఒక ప్రతిని తనకొరకు వ్రాసికొనవలెను" (ద్వితీ 17:18).

దేవుని మార్గములో రాజు తన ప్రజలను నడిపించవలెనన్న, అతడు తన యొద్దనున్న ధర్మశాస్త్ర ప్రతినుండి చదువుకొని దేవుని చిత్తమును తెలిసికొనవలెను.

యోషీయా అను ఒక మంచిరాజు ఏలుబడిలో యాజకుడైన హిల్కీయా యెహోవా ధర్మశాస్త్ర గ్రంథము యొక్క ప్రతి నొకదానిని దేవుని మందిరములో కనుగొనెను (2 దినవృ 34:14, 15). ఇది బహుశ నిబంధన మందసపు ప్రక్కన ఉంచబడిన ధర్మశాస్త్ర గ్రంథపు ప్రతియై యుండును. జాగ్రత్తగా అది రాజునొద్దకు తేబడగా, ధర్మశాస్త్ర గ్రంథపు నడిపింపు చొప్పున అతడు ప్రజల భక్తిజీవనములో మార్పును కలుగ జేయుట కారంభించెను. మన యొద్ద దేవుని ధర్మశాస్త్రము ఉంటేనేగాని సత్య (భక్తి) మార్గమును పునరుద్ధరించలేము. రాజైన యోషీయా విగ్రహారాధనను కూల్చదోయ గల్గెను గాని, దేవుని నియమావళి లేకుండా పస్కాను ఆచరించుట యెట్లో అతడెరుగకుండెను. దేవుని ధర్మశాస్త్ర గ్రంథము దీనిని అతనికి బయలు పరచెను. ఏలయనగా ఇదంతయు మోషే వ్రాసిన యెహోవా మాటలన్నిటిలో ఒక భాగము గనుక అది నిస్సందేహముగా పది ఆజ్ఞలను కూడా బయలుపరచెను.

యూదులు ఒకప్పుడు బబులోను బానిసత్వములో 70 సంవత్సరములు గడిపిరి. వారు తమ స్వదేశమునకు తిరిగి వచ్చినప్పుడు మందిరమును తిరిగి నిర్మించి పాత నిబంధన ఆరాధనను పునరుద్ధరించుట అవసరమాయెను. దానిని వారెట్లు చేసిరో గమనించుట ఆసక్తికరముగా యుండును. "అప్పుడు జనులందరును ఏక మనస్కులై నీటి గుమ్మము ఎదుట నున్న మైదానమునకు వచ్చి, యెహోవా ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించిన మోషే ధర్మశాస్త్ర గ్రంథమును తెమ్మని ఎజ్రా అను శాస్త్రితో చెప్పిరి" (నెహెమ్యా 8:1). "ఇటువలెనే వారు దేవుని గ్రంథమును స్పష్టముగా చదివి వినిపించి జనులు బాగుగా గ్రహించునట్లు దానికి అర్థము చెప్పిరి" (నెహెమ్యా 8:3). దేవుని ధర్మశాస్త్ర గ్రంథమందు పండుగ దినమును గూర్చి చదువగా దానిని లేఖనముల ప్రకారము ఆచరించు నిమిత్తము వారు ఏర్పాట్లు చేయసాగిరి.

యాజకులు ప్రజలకు బోధించుటకును, వారిని రాజు నొద్దకు నడిపించుటకును ధర్మశాస్త్ర గ్రంథము అతి ప్రాముఖ్యమైనది. రాతి పలకలు ఒక మందసపు పెట్టెలో నుంచబడెను. అది నిబంధన మందసమని పిలువబడెను. (సశేషము)

## బైబిలుయొక్క దైవావేశము-4

**(*The Inspiration of the Bible*)**

—*B.C.* గుడ్ పాశ్చర్

బైబిలు యొక్క ఏకత్వము అది మానవాతీతుని వలన కలిగెననుటకు ఒక గురుతుగా యున్నది. అది పదహారువందల సంవత్సరముల కాలములో, వివిధదేశములలో, వివిధ పరిస్థితులలో కనీసము 40 మందిచే వ్రాయబడిన 66 పుస్తకముల సంపుటియైయున్నది. అయినను అది ఆకారములో మాత్రమే గాక, దాని ఉద్దేశములోను, అంశములోను, ప్రగతిలోను ఒకే గ్రంథమైయున్నది. యేసు సాక్ష్యము ప్రవచనముయొక్క ఆత్మయై యున్నది. మానవులకు రక్షణార్థమైన జ్ఞానము నొసగు నిమిత్తము అది వ్రాయబడెను. ప్రతి లేఖకుడు మొత్తమునకు ప్రత్యేకముగా, సరిపడు విధముగా సమకూర్చెను. ఈ మనుష్యులు వ్రాసిన దానిని వ్రాయించుటకు ఒక శ్రేష్టజ్ఞాని వీరిని నడిపించెనని మాత్రమే దీనిని గూర్చి మనము జవాబీయవలసి వచ్చును. ఎవరెస్టు అను నాత డిట్లనెను: "నలువది మంది శిల్పకారులు వివిధ దేశములలో 1600 సంవత్సరముల కాలములో జీవించుచు, వివిధ కళాపోషక సంస్థలకు చెందినవారై ఒకరి నొకరు ఎరుగకుండగనే, ఒకని పనిని ఇంకొకడు ఎరుగకుండగనే ఒక చలువరాతి శిల్పము యొక్క వివిధ భాగములను చెక్కిన యెడల, అనేక శతాబ్దముల అంతమందు ఈ వివిధ భాగములన్నియు ఒకదానితో మరొకటి చక్కగా అమర్చబడి అతి పరిపూర్ణమైన, మహనీయ కళాకారుని పనివలె ప్రతిఫలించిన యెడల

అప్పుడు అందరు ఈ అద్భుతమును గుర్తించుదురు, మరియు మానవుని కంటె శాశ్వతమైనట్టియు, ఉన్నతమైనట్టియు జ్ఞాని యున్నాడని గ్రహింతురు. ఈ 40 మంది లేఖకులు అట్టి సందర్భములలోనే పని చేయగా వారి కృషియొక్క ఫలితముకూడ అట్టిదే". అదియే బైబిలు. దాని దివ్య ప్రేరణ మాత్రమే దాని ఏకత్వముకు జవాబుగా యున్నది.

చివరిగా, బైబిలు గ్రంథకర్త దేవుడే యని పరిష్కార నిదర్శనగా దాని ప్రవచనములను మనము చెప్పుకొనవచ్చును. మోసగాండ్రు సాధారణముగా ప్రవచనములనుండి తప్పుకొందురు. ప్రవచించి వారి పేరు ప్రఖ్యాతులను పాడుచేసికొనుటకు వారు భయపడుదురు! ప్రవచించవలెననే శోధనకు వారు లొంగిపోయినయెడల దాని వెనుక సంభవించు ఉదంతమునుబట్టి వారు సిగ్గుపడవలసి వచ్చును. అయితే బైబిలు లేఖకులు తరుచు ప్రవచించిరి. దాని కాలములో అది నెరవేరకుండా ఒక్కటికూడా విఫలము కాలేదు. ప్రవచనములు మూడు రకములు: నెరవేరిపోయినవి, నెరవేరుచూ యున్నవి మరియు నెరవేరబోవునవి. దివ్య ప్రేరణకు నిదర్శనముగా మొదటి రెండు రకములను మాత్రమే వినియోగించ గలమనునది విదితమే. ఈ రెండు రకములనుండి మనము కొన్ని ఉదాహరణలను ఎన్నుకొందము:

యెరికో పట్టణము నాశనమైన తరువాత దానిని కట్టించ పూనుకొనువాడు శాపగ్రస్తుడగునని యెహోషువ 6:26లో మనము చదువగలము. దానిని కట్టించువాడు దాని పునాదివేయగా వాని జ్యేష్టకుమారుడు చచ్చును; దాని తలుపు నిలువ నెత్తగా వాని కనిష్ట కుమారుడు చచ్చును అని ప్రవచింపబడెను. కాలము గడచిపోయెను. అయిదు వందల సంవత్సరములు జరిగిపోయెను. ఆ ప్రవచనము చెప్పినవారు దాని నెరవేర్పు కొరకు ఏమైన ప్రయత్నించవలెనంటే ఇది చాల దీర్ఘకాలమై పోయెను. హీయేలు యెరికో పట్టణమును కట్టించవలెనని యనుకొనెను. అతడు దాని పునాదివేయుగా అబీరాము అను అతని

జ్యేష్టపుత్రుడు చనిపోయెను; దాని గవునుల నెత్తగా సెగూబు అను అతని కనిష్ట పుత్రుడు కొన్ని శతాబ్దముల క్రితము ప్రవచింప బడిన రీతిగా చనిపోయెను (1 రాజులు 16:34). ఈ ప్రవచన సందర్భములో ఇమిడియున్న దీర్ఘకాలము, మరియు మిగిలిన వాస్తవములు మొదలగునవి దివ్య ప్రేరణవలన తప్ప వేరొక విధముగా సంభవించుట అసాధ్యము. యూదాదేశము నుండి దైవజను డొకడు వచ్చి ధూపము వేయుటకై యరోబాము బలిపీఠము నొద్ద నిలిచియుండగా దావీదు సంతతిలో యోషీయా అను నొకడు పుట్టి విగ్రహారాధనను నాశనముచేసి దేవుని ఆరాధనను పునరుద్ధరించుటకు అదే బలిపీఠము మీద యాజకులను, మనుష్యశల్యములను దహనము చేయునని ప్రవచించెను (1 రాజులు 13:1, 2). ఇది బహు వర్ణనాత్మకమును సవిస్తరమునైన ప్రవచనము. అయినను 350 సంవత్సరముల తరువాత అది అక్షరాల నెరవేరెను (2 రాజులు 23:15-20). ఈ ప్రవచనమును పలికిన వాడు దాని నెరవేర్పులో ఏమాత్రము తన పలుకుబడిని వినియోగించుట దుర్లభము. ఆ ప్రవచనము పలికిన అతిత్వరలోనే అతడు చనిపోయెను. సరిగదా దాని నెరవేర్పు కొన్ని శతాబ్దముల తరువాత సంభవించెను. అయితే యోషీయా అను పేరుగల రాజవంశస్థుడు యరోబాము నిర్మించిన బలిపీఠముపై ఈ ప్రత్యేక క్రియలు జరిగించునని దైవజనునికి అంత ముందుగా ఎట్లు తెలిసెను? మరల దీనికి సరియైన జవాబు దివ్యప్రేరణ యని మాత్రము మనము చెప్పకొనక తప్పదు. ప్రష్యాదేశపు చక్రవర్తి యగు ఫ్రెడరిక్ ది గ్రేట్ అను నతడు బైబిలు దివ్యప్రేరణ గల గ్రంథమనుటకు నిదర్శనముగా ఒక్క మాటలో చెప్పుమని తన ఆస్థాన పురోహితుని అడుగగా అతడు "యూదులు" అని జవాబిచ్చెను. అది చెడ్డ జవాబేమీ కాదు. బైబిలు మానవాతీతుని యొద్దనుండి కలిగెననుటకు యూదులు నిదర్శనముగా యున్నారు. ద్వితీయోపదేశ కాండము 23 అధ్యాయములో యూదుల భవిష్యత్తును గూర్చి మోషే సవిస్తర ప్రవచనమును పలికెను. వారు

దేవుని యెడల నమ్మకముగా యున్నంతకాలము వారు తమ దేశములో సర్వసమృద్ధి కలిగి యుందురనియు, వారి శత్రువు లెవరు వారి యెదుట నిలువనేరరనియు అతడు వారికి చెప్పెను. అయితే వారు అవిశ్వాసులైన యెడల వారు తమ దేశమునుండి తీసుకొనిపోబడి కఠినముగా శిక్షింపబడుదురని కూడ అతడు చెప్పెను. వారు తమమీదికి తెచ్చుకొను హానిసత్వమును గూర్చి, శిక్షనుగూర్చి అతడు వివరముగా తెలియ జెప్పెను. యెరూషలేము ముట్టడి నాశనమును గూర్చియు, యూదులకు కలుగు నిర్భాగ్యస్థితిని గూర్చియు మోషే వివరించి చెప్పెను. యెహోవా దూరమైయున్న భూదిగంతమునుండి ఒక జనమును గద్ద యెగిరి వచ్చునట్లు వారిమీదికి రప్పించుననియు, యూదులకు రాని భాష వారు మాట్లాడుదురనియు, వారు యూదయ, యెరూషలేముల ప్రాకారములు పడువరకు ముట్టడించుదురనియు, ఆ ముట్టడిలో ప్రజలు కనీవినీ యెరుగని ఇబ్బందులు పాలగుదురనియు, అతి కఠినమైన కరువువలన మృదువైన స్వభావముగల యెరూషలేము స్త్రీలు తమ పిల్లలనే చంపుకొని తిందురనియు, ఈ ముట్టడిలో అసంఖ్యాకులైన యూదులు మరణింతురనియు, మరియు అసంఖ్యాకులైన యూదులు దాసులుగాను, దాసీలుగాను అమ్మబడుటకై ఐగుప్తుకు కొనిపోబడుదురు గాని వారిని కొనువాడొకడైనను ఉండడనియు, వారు పాలస్తీనా నుండి వెళ్లగింపబడి భూమిమీద నున్న సమస్త జనులలోనికి చెదరగొట్ట బడుదురనియు, అక్కడ వారు హింసింపబడి అణచివేయ బడుదురనియు, వారికి రాత్రింబగళ్లు విశ్రాంతి దొరకక ప్రతిచోట బాధింప బడుదురనియు, వారు జనాంగములలో కేవలము ఒక ఛలోక్తివలె మాత్రము యుందురనియు అతడు ప్రవచించెను. పరిశుద్ధ పట్టణమగు యెరూషలేము యొక్క ముట్టడి, నాశనములను గూర్చి చరిత్రకారుడైన జోసిఫస్ వ్రాసిన వివరణ ఈ ప్రవచన నెరవేర్పును అతి శ్రేష్ఠముగా వర్ణించుచున్నది. యూదుల వెనుకటి చరిత్ర మోషే చెప్పిన ప్రవచనములోని ప్రతి అంశము

యొక్క నెరవేర్పై యున్నది. యిర్మీయా యిట్లు ప్రవచించెను: "నిన్ను చెదరగొట్టిన జనము లన్నిటిని నేను సమూల నాశనము చేసె దనుగాని నిన్ను సమూలనాశనము చేయను" (యిర్మీయా 30:11). పురాతన అష్షూరు దేశస్థులు గతించిపోయిరి, బబులోనీయులు గతించి పోయిరి, పురాతన రోమా సామ్రాజ్యము నాశనమై పోయెను, అయి నను యూదులు ఇప్పటికింకా ఉన్నారు. పాతనిబంధన ప్రవచనముల యొక్క యథార్థత, దివ్య ప్రేరణలకు వారు సజీవులై యున్న గురు తుగా యున్నారు. యెరూషలేము నాశనము గావించబడక 1500 సంవ త్సరముల ముందే మోషే ఎట్లు భవిష్యత్తు చెప్పగలిగెను? లేదా మన కాలమువరకు ఉన్న 35 శతాబ్దముల మట్టుకు యూదులకు సంభ వించు ఇక్కట్లను గూర్చి దివ్య ప్రేరణవలన గాక మరి దేనివలన అతడు చెప్పగలిగెను? వారి పురాతన శత్రువులు సమూల నాశనమై పోయినను యూదులు ఇప్పటికింకా మిగిలియుందురని యిర్మీయాకు ఎట్లు తెలియును? బైబిలు లేఖకులు పరిశుద్ధాత్మ ప్రేరేపణవలన పలి కిరి యని మాత్రమే మనము లెక్క చెప్పగలము.

మానవ పరిశోధన, ప్రతిఘటనల యొక్క అగ్ని గుండములో ఈ శతాబ్దముల తరబడి బైబిలు ఉంటూనే యున్నది. అయినను కనీ సము అగ్నివాసన కూడ తన బట్టలకు తగులకుండ అది బయట పడుచునే యున్నది. అభ్యాససిద్ధమైన అనుభవ కఠిన పరీక్షలో అది నిలువబడ గలిగింది. న్యాయయుక్త విచారణలో అదెన్నడు పరాజయము పొందలేదు. బహిరంగ వాగ్వివాదములలో దానిని మనము చూచి యుంటిమి, మరణించువారి శయ్య ప్రక్కన అది యుండుట మనము గమనించితిమి, మృతుల సమాధులలో దానిని మనము చూచి యుంటిమి, అయినను తూకము వేయగా అది లోపించి యుండుట మనము ఎన్నడును చూచి యుండలేదు. అది దేవుని గ్రంథము!

— సమాప్తం —

# లేఖనానుసారమైన నామము

## ( *The Scriptural Name* )

పరలోకమందున్న దేవుడు ఉద్దేశించిన నామమును పెట్టుకొనుట సరైనది ఎందుకనగా దేవుని చిత్తమును జరిగించినచో దేవుడు సంతోషించును. భూలోకములో ఉండి ఆయన నామమును ధరించుకొనుట అత్యుత్తమము.

మానవులు ప్రవేశపెట్టిన పేర్లు దేవుని దృష్టికి అంగీకార యోగ్యము కాదు. మనుష్యులు వారికి తోచిన విధముగా నామములు ధరించుకొనుటవలన చీలికలు, కలహములు ఏర్పడుచున్నవి. ఆలాగు అందరూ భేదములు పెంచుకుని వేరగుటలో వేర్పాటు భావమును ఆయన సమూల ధ్వంసము చేసినట్లుగా కనబడుచున్నది. ( యోహాను 17:20,21). భేదములు, కక్షలు, కలహములను అపొస్తలుడైన పౌలు నిశితముగా విమర్శించెను (1కొరింథీ 1:10-15). కొందరు వ్యక్తుల పేర్లను ఘనపరచుచు పెట్టుకున్న పేర్లు ఆవ్యక్తుల్నే ఘనపరచును. దీనికి లూథరన్ సంఘము ఉదాహరణముగా నున్నది. సంఘపరిపాలనా విధానమును అనుసరించి పెట్టుకున్న నామము పాలనా విధానమునే తప్ప దేవునిని ఘనపరచదు. ఈలాగు మెథడిస్టులు, ప్రెస్బిటేరియన్లు దేవునికి దూరముగా నున్నారని నిస్సందేహంగా చెప్పగలం, అవిశ్వాసులకు ఎదురుగా తబ్బిబ్బులు, సందేహములు కల్గించి, ఏ సంఘమునకైనా దేవుడు మెచ్చుకొనును అని చాటించుట కేవలము వారికి అడ్డుబండలుగా నిలుచుటయే అగును. ఆ విధముగా కాక క్రీస్తు నామమును ధరించి, అనేక జనులనాకర్షించుటయే దేవుని ఉద్దేశము.

యెహోవా నియమింపబోవు క్రొత్త నామము మనము ధరించవలెనని దేవుని ఆశయము (యెషయా 62:2). అన్యజనుల యెదుటను రాజుల యెదుటను, ఇశ్రాయేలీయుల యెదుటను ఆయన నామమును

భరించి ఘనపరుచుటకు పౌలు పిలువబడెను (అపొ.కా. 9:15). అన్య జనులు దేవుని మహిమను చూచిన అనంతరమును క్రీస్తు నామమును ధరించుట జరిగెను (యెషయా 62 : 2). ఈ సంగతి, అన్యుడైన కొర్నేలీ విషయములో నెరవేరినది. కొర్నేలీ క్రీస్తు మహిమను చూచి నాడు (అపొ.కా. 11:26). అన్యజనులు ఆయన నామమును ధరించు టకు వెనుకాడలేదు (అపొ.కా. 15:17). క్రైస్తవుడు అను నామము ధరించవలెనని పౌలు అగ్రిప్పకు బోధించుటనుబట్టి, వెంటనే అగ్రిప్ప, ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయ జూచుచున్నావే అని పౌలును నివారించెను (అపొ.కా. 26:26-28). కాని ఆ నామములో నున్న శ్రేష్ఠత్వమును అగ్రిప్ప అర్థము చేసుకొనలేకపోయెను (యాకోబు 2:7). శ్రమలలోను, బాధలలోను మనము ఆ నామమును మహిమ పరచుటయే, లేక పైకెత్తుటయే ఆ నామము ధరించుకొనుటలో గల ముఖ్య ఉద్దేశ్యము (1 పేతురు 4:14-16).

సంఘమునకు అన్వయించబడిన సామాన్య నామములు :—

దేవుని సంఘము 1 కొరింథీ 1:2, క్రీస్తు సంఘములు (రోమా 16:16) కొన్నిసార్లు దేవుని రాజ్యమని (మత్తయి 13:24), క్రీస్తు శరీర మని (ఎఫెసీ 1:22, 23), దేవుని మందిరమని (1 తిమోతి 3:15) పిలువబడెను. సంఘములోని సభ్యులు క్రైస్తవులని (అపొ.కా. 11:26) పరిశుద్ధులు (ఫిలిప్పీ 4:21), శిష్యులు (అపొ.కా. 16:1). సహోదరులు (కొలస్స 1:2) అని పిలువబడిరి. ఈ పేర్లు వ్యక్తిగతముగా ఉపయోగించ బడినవికాని, ఈ పేరులమీద సంఘములు పిలువబడవలెనని కాదు.

కేవలము దేవుడు ఎన్నిక చేసిన నామమును ఎందుకు ధరించవలె ననగా :—సంఘము క్రీస్తునకు పెండ్లి కుమార్తె (2 కొరింథీ 11 :2), దేవుని కుటుంబము (ఎఫెసీ 3:14, 15), మనము ఏమిచేసినప్ప టికిని క్రీస్తు నామమున చేయుట జరుగవలెను (కొలస్స 3:17). ఏక త్వము సాధించవలెనంటే, ఆ పేరు పెట్టుకొనుట శ్రేయస్కరము.

క్రీస్తు నామముకంటే మించిన నామము, ఘనమైన నామము మరి యొకటిలేదు (ఫిలిప్పీ 2:9, 11). మతనాయకుడైన లూథర్, తన నామ మును గాక, క్రీస్తు నామమును ధరించుకొనవలెనని చెప్పెను. జాన్ వెస్లీ పలుపార్టీలకు తావులేదని చెప్పెను. కాంప్‌బెల్ అనునతడు అందరూ క్రైస్తవులే అనిపించుకొనవలెనని క్రీస్తు నామము ధరించు కొనుటవలననే అది సాధ్యమగునని క్రోడీకరించెను. మానవుడు రక్షింప బడవలెనంటే, క్రీస్తు నామమే శక్తిగల నామము (అపొ.కా. 4:12). ప్రతి మోకాలు క్రీస్తు నామమున వంగి, ఆయనకు నమస్కారము చేయవలసినదే (ఫిలిప్పీ 2:9-11).

ఎవరైనాసరే, దేవునిని సంతోషపెట్టుటకు యిచ్ఛయించినచో, బైబిలులో మనము కనుగొను నామమునే ధరించుకొన వలెనుగాని, బైబిలునందు కనబడని నామమును ధరించి, ఆయన నామమునకు అపకీర్తి తేకూడదు.

—A. సత్యవర్ధనరావు

---

## ఎవడును మిమ్మును మోసపుచ్చకుండా చూచుకొనుడి (మార్కు 13:5)

### *(Take Heed that No Man Deceive You)*

"మీలోను అబద్ధ బోధకులుందురు...వారు అధిక లోభులై కల్పనావాక్యములు చెప్పుచు మీవలన లాభము సంపాదించు కొందురు." "అట్టివారు మన ప్రభువైన క్రీస్తునకుగాక తమ కడుపునకే దాసులు. వారు ఇంపైన మాటలవలనను, ఇచ్ఛకముల వలనను, నిష్క పటుల మనసులను చెరుపుదురు" (2 పేతురు 2:1, 2; రోమా 16:18).

మీరు ఎంత కాలమునుండి యేసును నమ్ముకొని ప్రార్థిం
చున్నారో, ఏ గుడికి వెళ్ళుచున్నారో, ఎవరి బోధ వినుచున్నారో
"ఏమి వినుచున్నారో జాగ్రత్తగా చూచుకొనుడి." (లూకా 8:18)
"ఇప్పుడు అనేకులైన క్రీస్తు విరోధులు బయలుదేరి యున్నారు"
(1 యోహాను 2:18). వారు "అబద్ధమును నమ్మునట్లు మోసముచేయు
శక్తిని కలిగి యున్నారు" (2 థెస్స 2:12). "అబద్ధికులందరును అగ్ని
గంధకములతో మండు గుండములలో పాలు పొందుదురు (ప్రకటన
21:8). క్రొత్తనిబంధన సత్యమునకు విరోధముగా కల్పించిన అనేక
అబద్ధ సిద్ధాంతములలో కొన్నింటిని ఈ దిగువ చూడుడి. వీటిని విడిచి
క్రీస్తును చేరండి.

1. ప్రభువు దర్శనములో కనబడి "నా కుమారుడా సేవ చేయుము" అని పిలచెను.
2. దర్శనములో వెలుగు కనబడును, స్వరము వినబడును. కని పెట్టుడి.
3. రోగనివారణ, సిరిసంపదలకొరకు క్రీస్తును నమ్ముకొనవలెనని బోధింతురు.
4. స్వస్థత వరముగల నేను ప్రార్థించి ఇచ్చిన సీసాలో నూనె త్రాగిన రోగి బాగుపడునందురు.
5. ప్రతీ శుక్రవారం, శనివారం లేక మరి కొన్ని రోజులు ఉపవాస కూటములను బహిరంగ ప్రకటనలతో ఆచరించుదురు.
6. డప్పు మొదలగు వాయిద్యములతోను, చప్పట్లతోను పాడి ఆరాధన జరుపుదురు.
7. పరిశుద్ధాత్మ నింపుదల అని చెప్పుచు, కేకలు, గోల, క్రింద పడి దొర్లుటవంటి వేషధారణ కార్యాలతో భ్రమపచ్చుదురు.
8. ఎక్కువ స్థితిగలిగి ఎక్కువ డబ్బు ఇవ్వగలవారిని నగలతో సంఘములో చేర్చుకొనుచు, తక్కువ స్థితిగల వారిని నగలు (గాజులు) తీయించి వేయుదురు.

ఇట్టి ఆచారములు వాక్యానుసారమైనవి కావని నిరూపించుటకు తెరవబడిన బైబిలుతో సత్యాన్వేషణ చేయండి. "సత్యవర్తనుడైతే తన క్రియలు దేవుని మూలముగా చేయబడినవని ప్రత్యక్ష పరచబడునట్లు వెలుగు నొద్దకు వచ్చును" (యోహా 3:21).

అంత మాత్రమే గాక ఈ అబద్ధ బోధకులు—ఏ సంఘము, ఏ మిషనుకు కావలసిన సిద్ధాంతమును వారికి బైబిలే బోధించుచున్నది గనుక ఏ సిద్ధాంతము మనము కలిగియున్నను ఫరవాలేదు అని చెప్పి అనేకులను మోసగించుచున్నారు. గాని బైబిలు నిశ్చలమైన దేవోక్తి గనుక ఒకే సత్యమును బోధించుచున్నది. "ఎవడును మిమ్మును మోస పరచనీయకుడి" (2 థెస్స 2:4).

—పాల్ గూటం, గొల్లవిల్లి.

## అపార్థము చేయువారి అంతము

"వీటిని విద్యావిహీనులును, అస్థిరులైనవారును, తక్కిన లేఖనములను అపార్థము చేసినట్లు, తమ స్వకీయ నాశనమునకు అపార్థము చేయుదురు" (2 పేతురు 3:16). ఈ వాక్యమందలి "అపార్థము" అను పదమునకు గ్రీకు క్రొత్త నిబంధనలో "స్ట్రెబ్లూ" అను పదము వాడబడినది. దానికి అసలైన భావమును వదలిపెట్టుట, సత్యమునుండి తొలగిపోవుట, తప్పుదారి పట్టించుట, వక్రమముగా త్రిప్పుట, సత్యమునకు బదులుగా అబద్ధము చెప్పుట యను అర్థములు గలవు.

పై వాక్య ప్రకారము కొన్ని ఉదాహరణలు: 1. "నా సంఘమును కట్టుదును" అని క్రీస్తు చెప్పెను. గనుక అది ఎవరి సంఘము? క్రీస్తుదే. అయితే అనేకులు - ఏ పేరైనను ఒక్కటే యనుట సత్యమునుండి తొలగిపోవుటయే; 2. రక్షణ పొందుటకు బాప్తిస్మము పొందవలెను యని క్రీస్తుబోధించెను. గాని నేడు కొందరు - కేవలము విశ్వాసము వలన రక్షణ పొందగలమని బోధించుట తప్పుదారి పట్టించుటయే;

3. నేడు అద్భుత స్వస్థతలు చేయగలమని చెప్పుకొనుట అసలైన భావమును వదలిపెట్టుటయే; 4. బాప్తిస్మము అనగా చిలకరింపు అని బోధించుట సత్యమును అసత్యముగా మార్చుటయే; 5. క్రైస్తవులు పాత నిబంధనయొక్క విధులకు బద్ధులు యని ప్రకటించుట లేఖనములను వక్రముగా త్రిప్పుటయే.

ఇటువంటి అబద్ధబోధలు చేయువారందరు పౌలుయొక్క ప్రవచనమునకు నెరవేర్పుగా కన్పడుచున్నారు: "శిష్యులను తమ వెంట ఈడ్చుకొని పోవలెనని వంకరమాటలు పలుకు మనుష్యులు......" (అపొ 20 : 30). "కీడు మేలనియు, మేలు కీడనియు చెప్పుకొని, చీకటి వెలుగనియు, వెలుగు చీకటనియు, తీపి చేదనియు, చేదు తీపి అనియు ఎంచుకొనువారికి శ్రమ" (యెషయా 5:20). అంటే సత్యమును అసత్యముగను, అసత్యమును సత్యముగను మార్చి బోధించువారికి శ్రమ. సత్యమును ఉన్నది ఉన్నట్లుగా కాక తమకు అనుకూలముగా త్రిప్పుకొని బోధించువారు (ఎఫెసీ 4:20) నాశన పాత్రులు; పైగా వారి కల్పిత బోధలకు లోబడినవారును నశింతురు (లూకా 6:39).

—S. P. దాస్

---

*From*
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA–533 001

**Printed Book only**

To
..............................
..............................
..............................
..............................